వలంటీర్ వ్యవస్థ ఒక అద్భుతం

చింతలపూడి: రాష్ట్రంలో అమలవుతున్న గ్రామ వలంటీర్ వ్యవస్థ ప్రపంచంలోనే ఒక అద్భుతమని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కంభం విజయరాజు పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో సోమవారం వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా గ్రామ, వార్డు వలంటీర్ల సత్కార కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ డా బి.రాంబాబు నాయక్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి విజయరాజు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పథకం అందాలంటే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేదని, ఎవరి చేతులూ తడపాల్సిన పనిలేదని, రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ కులం, మతం చూడకుండా సంక్షేమ ఫలాలు, ప్రభుత్వ సేవలు నేరుగా అందించడానికి ప్రభుత్వం వలంటీర్ల వ్యవస్థను ప్రవేశ పెట్టిందన్నారు. రాష్ట్రంలో 2.50 లక్షల మందికి వలంటీర్ ఉద్యోగాలు ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కిందని చెప్పారు. ప్రతి గ్రామంలో సచివాలయం ఏర్పాటు చేసి మెరుగైన పాలన అందించడమే సీఎం ప్రధాన ఉద్దేశ్యమన్నారు. వలంటీర్ వ్యవస్థను విమర్శించిన ప్రతిపక్ష నాయకుల నోళ్లు మూతపడేలా వలంటీర్ వ్యవస్థ అద్భుత విజయాన్ని అందుకుందని అన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుచూపుతో ప్రవేశ పెట్టిన ఈ వ్యవస్థ ఇతర రాష్ట్రాలకే కాక ఇతర దేశాలకు కూడా ఆదర్శప్రాయంగా నిలిచిందని కొనియాడారు. వలంటీర్లను మరింత ప్రోత్సహించాలన్న సంకల్పంతో సేవామిత్ర, సేవారత్న, సేవా వజ్ర అవార్డులు ఇచ్చి నగదు బహుమతులతో సత్కరిస్తున్నట్లు ఏఎంసీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి తెలిపారు. మరోసారి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి వలంటీర్ గడప, గడపకూ తిరిగి జగనన్న అందించిన సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని గుర్తు చేయాలని కోరారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే సంక్షేమ పథకాలు ఉండవు, వలంటీర్లు ఉండరని హెచ్చరించారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలతో పేదలకు సత్వర సేవలు అందించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు. అనంతరం సభలో వలంటీర్లను సత్కరించి పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ జగ్గవరపు జానకిరెడ్డి, జెడ్పీటీసీ ఎం.నీరజా సుధాకర్, ఎంపీపీ బి.రాంబాబు నాయక్, పట్టణ పార్టీ కన్వీనర్ కొప్పుల నాగేశ్వరరావు, జగన్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి గంధం రామ్మోహన్‌రావు, మాజీ ఏఎంసీ చైర్మన్ బొడ్డు వెంకటేశ్వర్రావు, సర్పంచ్‌లు, సొసైటీ అధ్యక్షులు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.


చింతలపూడి ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో వలంటీర్లను సత్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కంభం విజయరాజు, నేతలు

సుందర 'గిరి' కాంతులు


కొండపైకి వెళ్లే ఘాట్ రోడ్డులో ఇరువైపులా విద్యుద్దీప అలంకారాలు


ఆలయ ఆవరణలో స్వామివారి భారీ విద్యుత్ కటౌట్


నారసింహుని ఆలయంలో విద్యుత్ కాంతులు

ద్వారకాతిరుమల: నారసింహుని దివ్య కల్యాణ మహోత్సవాలకు ఐఎస్ జగన్నాధపురంలోని సుందరగిరి పర్వతం సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఆలయ పరిసరాలు విద్యుద్దీప కాంతులీనుతున్నాయి. అలాగే సుందరగిరిపై ఏర్పాటు చేసిన నారసింహుని భారీ విద్యుత్ కటౌట్, ఘాట్ రోడ్డుకు ఇరువైపులా అమర్చిన విద్యుద్దీప తోరణాలు మిరుమిట్లు గొలుపుతున్నాయి. వృక్షాలు సైతం విద్యుత్ అలంకరణలతో కనువిందు చేస్తున్నాయి. ఇదిలా ఉంటే ఈనెల 20 నుంచి 25 వరకు స్వామివారి కల్యాణ మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగనున్నాయి. అందులో భాగంగా ఉత్సవాల తొలిరోజు మంగళవారం ఉదయం 10.40 గంటలకు ఆలయ అర్చకులు, పండితులు స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలుగా చేస్తారని ఆలయ ఈఓ వేండ్ర త్రినాధరావు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు ఈ వేడుకల్లో పాల్గొనాలని ఆయన కోరారు.

సచివాలయాలతోనే గ్రామ స్వరాజ్యం

బుట్టాయగూడెం: రాష్ట్రంలోని సచివాలయ వ్యవస్థతో మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సాధ్యమైందని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త తెల్లం రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని ముప్పినవారిగూడెం సమీపంలో ఆర్‌అండ్‌ఆర్ కాలనీ(కట్కూరుగమ్ము-2)లో సోమవారం నూతనంగా నిర్మించిన రైతు భరోసాకేంద్రం, సచివాలయం, విలేజ్ క్లినిక్‌లను వారు ప్రారంభించారు. అదేవిధంగా ఇప్పలపాడులో రైతుభరోసా కేంద్రం, కొమ్ముగూడెంలో సచివాలయ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సచివాలయాల ద్వారా గ్రామంలోనే ప్రజలకు పారదర్శకంగా ప్రభుత్వ సేవలు అందించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని అన్నారు. ప్రతి గ్రామ సచివాలయ పరిధిలో గ్రామస్తుల మౌలిక అవసరాలు తీర్చేలా కృషి చేయడం జరిగిందని అన్నారు.

స్థల దాతలకు సన్మానం

మండలంలోని కొమ్ముగూడెంలో సచివాలయాలు, ఆర్‌బీకేల నిర్మాణాలకు స్థలాలు దానం చేసిన దాతలను ఎమ్మెల్యే బాలరాజు, రాజ్యలక్ష్మిల చేతుల మీదుగా సత్కరించారు. కీర్తిశేషులు బిక్కిన శ్రీరాములు, దమయంతి దంపతుల పేరుమీద వారి కుమారులు బిక్కిన సత్యనారాయణ, నారాయణ, వీర్రాజు, వెంకటేశ్వరరావు స్థల దానం చేశారని ఈ సందర్భంగా వారిని సన్మానించారు. అలాగే ఆలపాటి దుర్గారావును సన్మానించారు.


కొమ్ముగూడెంలో నూతన సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు, రాజ్యలక్ష్మి

సిద్ధం సభలతో చంద్రబాబు వెన్నులో వణుకు

దేశ చరిత్రలో కనీవినీ ఎరుగని విధంగా సిద్ధం సభలు విజయవంతం కావడంతో ప్రతిపక్ష నేత చంద్రబాబు వెన్నులో వణుకు పుడుతుందని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. అనంతపురం జిల్లా రాప్తాడులో జరిగిన సిద్ధం సభ రాష్ట్ర చరిత్రలోనే అతిపెద్ద ప్రజాసభగా నిలిచిపోతుందని అన్నారు. దాదాపు 10 లక్షల మందికిపైగా కార్యకర్తలు తరలిరావడం చరిత్రాత్మక నిర్ణయమని అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బయటకు రాకుండా క్యాంప్ కార్యాలయానికే పరిమితమయ్యారంటూ చంద్రబాబు ఆరోపణలు చేస్తూ వచ్చారని అన్నారు. అయితే జగన్ బయటకు వచ్చి సిద్ధం వంటి సభలు పెడుతుంటే వచ్చే ప్రజలను చూసి చంద్రబాబు గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ కారం శాంతి, సర్పంచ్‌లు తెల్లం వెంకాయమ్మ, మడకం రామలక్ష్మి, వేలేరుపాడు ఎంపీపీ వి.లక్ష్మీదేవి, పార్టీ నాయకులు అల్లూరి రత్నాజీరావు, ఆరేటి సత్యనారాయణ, రేపాకుల చంద్రం, సోడెం సుధాకర్, సొసైటీ అధ్యక్షులు కలగర నాని, మండల సచివాలయాల కన్వీనర్ కణితి దుర్గారావు, మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీగా సురేష్‌కుమార్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ



పోలవరం రూరల్: పోలవరం డీఎస్పీగా ఎస్.సురేష్‌కుమార్ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన విజయవాడలో ట్రాఫిక్ ఏసీపీగా పనిచేసి బదిలీపై పోలవరం వచ్చారు. ఆయన గతంలో గుంటూరు, ఒంగోలు, నెల్లూరు జిల్లాల్లో విధులు నిర్వహించారు. నూతన డీఎస్పీ సురేష్‌కుమార్‌రెడ్డికి పోలవరం సీఐ జి.మధుబాబు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. పోలవరం సబ్ డివిజన్ పరిధిలో సబ్ ఇన్‌స్పెక్టర్లు డీఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు.

సింహ ద్వారం ఏర్పాటు

జంగారెడ్డిగూడెం రూరల్: మైసన్నగూడెం గ్రామ దేవత శ్రీమహాలక్ష్మీ అమ్మవారి ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా సోమవారం గ్రానైట్ సింహ ద్వారాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. వందనపు సూర్య చంద్రరావు, మహాలక్ష్మీ రూ.35 వేల విలువైన గ్రానైట్ సింహద్వారాన్ని అందజేసినట్లు అర్చకులు కె. వెంకటేశ్వరరావు తెలిపారు.

వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శిగా గంధం చంటి

చింతలపూడి: వైఎస్సార్ సేవాదళ్ కార్యదర్శిగా చింతలపూడి పట్టణానికి చెందిన గంధం రామ్మోహన్ రావు(చంటి) నియమితులయ్యారు. ఈమేరకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఉత్తర్వులు అందినట్లు చంటి తెలిపారు. సోమవారం చింతలపూడిలో జరిగిన కార్యక్రమంలో చంటిని పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కె విజయరాజు, ఏఎంసీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి, జెడ్పీటీసీ ఎం.నీరజాసుధాకర్, ఎంపీపీ డా రాంబాబు నాయక్, పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా చంటి మాట్లాడుతూ తన సేవలను గుర్తించి వైఎస్సార్ సేవాదళ్ కార్యదర్శిగా ఎంపిక చేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, పార్టీ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు సుధీర్‌కుమార్‌రెడ్డి, కోఆర్డినేటర్ చినమిల్లి వెంకట్రామయ్య, పార్టీ జిల్లా అధ్యక్షులు ఆళ్ళనాని, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌బాబు తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.


వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శిగా ఎంపికైన గంధం చంటిని సత్కరిస్తున్న దృశ్యం

పుట్రేపు రహదారి అభివృద్ధి పనుల ప్రారంభం

టి.నరసాపురం: సంక్షేమంతో పాటు అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని జెడ్పీటీసీ సామంతపూడి బాల సూర్యనారాయణరాజు(సూరిబాబు) అన్నారు. మండలంలోని పుట్రేపు రహదారి అభివృద్ధి పనులకు ఆయన సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సూరిబాబు మాట్లాడుతూ పుట్రేపు, బండివారిగూడెం రహదారి 3.9 కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.1.35 కోట్లు మంజూరయ్యాయని వివరించారు. ఇప్పటికే రహదారి అభివృద్ధి పనులకు టెండర్లు ఖరారయ్యాయని, 10 రోజుల్లోగా రహదారి పనులు పూర్తి చేస్తామన్నారు. అలాగే మండలంలోని మర్రిగూడెం రహదారి అభివృద్ధికి రూ.1.07 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. ఆ రహదారి పనులను కూడా వెంటనే ప్రారంభిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీతో పాటు దేవరపల్లి ముత్తయ్య, పార్టీ మండల యూత్ అధ్యక్షులు కన్నం సర్వేశ్వరరావు, టి.నరసాపురం శాఖా గ్రంథాలయ చైర్మన్ నల్లూరి శ్రీనివాస్, ఎంపీటీసీలు నార్లపాటి వెంకట్రావు, అర్జా బాలయ్య, ఆలయ కమిటీ చైర్మన్ కమ్మిల రమేష్‌రాజు, అర్జా సాగర్ తదితరులు పాల్గొన్నారు.


రహదారి అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సూరిబాబు

'స్పందన'లో 9 అర్జీల స్వీకరణ

జంగారెడ్డిగూడెం: స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుంచి 9 అర్జీలు వచ్చినట్లు ఆర్డీవో అద్దయ్య తెలిపారు. ఈ అర్జీలను సంబంధించి అధికారులకు పంపించడం జరుగుతుందన్నారు. అర్జీలలో పరిష్కారం కాని దరఖాస్తులకు సంబంధించి ఆయా అర్జీదారులకు సమాచారం ఇచ్చి, ఎందుకు పరిష్కారం కావో, వాటికి సంబంధించి సాంకేతిక సమస్యలను తెలియజేయాలని అధికారులకు వివరించారు. అలాగే పరిష్కరించదగిన సమస్యలను నిర్ణీత గడువు పేర్కొని, ఆలోగా పరిష్కరించాలని ఆదేశించారు. సమస్య పరిష్కారం తదితర అంశాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఇళ్ల రిజిస్ట్రేషన్ల ప్రక్రియ వేగవంతం

దెందులూరు: మండలంలో ఇప్పటి వరకు 17 గ్రామ పంచాయతీల్లో 72 శాతం ఇళ్ల రిజిస్ట్రేషన్ పూర్తయ్యాయని తహసీల్దార్ వీ.జితేంద్ర అన్నారు. సోమవారం కొవ్వలి సచివాలయంలో ఇళ్ల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆయన పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. లబ్ధిదారులు త్వరితగతిన రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని దీనికి వీఆర్‌ఓలు తమ వంతు తోడ్పాటు అందించాలన్నారు. కార్యక్రమంలో వీఆర్వోలు రామకృష్ణ, కిషోర్, వీఆర్‌ఏలు ఉన్నారు.

హమాలీల అభివృద్ధికి అన్ని విధాలా కృషి

ఏలూరు రూరల్: హమాలీల అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తానని ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. సోమవారం స్థానిక మార్కెట్ యార్డ్‌లో హమాలీలకు ఆయన దుస్తులు పంపిణీ చేశారు. ఈ యార్డ్‌లో జెంబోషెడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.4 కోట్లు మంజూరు చేసిందని నాని గుర్తు చేశారు. ఇదే క్రమంలో మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యం కోసం లక్షలాది నిధులు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. కరోన సమయంలో హమాలీలకు ప్రత్యేక మెడికల్ క్యాంప్‌లు నిర్వహించామని గుర్తు చేశారు. లాక్‌డౌన్ సమయంలో రైతులు ఆర్థిక నష్టపోకుండా ట్రాన్స్‌పోర్టు సౌకర్యం కల్పించామని వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలతో పాటు హమాలీలూ సంక్షేమ పథకాలు అందుకోవడం సంతోషంగా ఉందని చెప్పారు. ఏఎంసీ చైర్మన్ నెరుసు చిరంజీవులు మాట్లాడుతూ ఎమ్మెల్యే నాని సహకారంతో రైతులు, హమాలీలకు మేలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఏటా హమాలీలకు దుస్తులు పంపిణీ చేయడం సంతోషంగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో యార్డ్ వైస్ చైర్మన్ కంచెన రామకృష్ణ, నగర మేయర్ షేక్ నూర్జహాన్, డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాస్, నూకపెయ్యి సుధీర్‌బాబు, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, రైతు నాయకులు నాగం శివ తదితరులు పాల్గొన్నారు.

పాత కక్షల నేపథ్యంలో వ్యక్తిపై దాడి

పెదవేగి : పాత కక్షల నేపథ్యంలో ఇద్దరు వ్యక్తులు కలిసి ఒక వ్యక్తిపై దాడి చేసి గాయపరచారని పెదవేగి ఎస్సై వీ రాజేంద్రప్రసాద్ తెలిపారు. వివరాల ప్రకారం పెదవేగి మండలం జగన్నాథపురం గ్రామానికి చెందిన లంకపల్లి అశోక్ రెండు రోజుల క్రితం కూరగాయాలు అమ్ముకుంటా మోటారు సైకిల్‌పై వెళుతుండగా, అదే సమయంలో కాటం రంగారావు, మరో వ్యక్తి కలిసి పాత కక్షల నేపథ్యంలో అశోక్‌పై దాడి చేసి, గాయపరిచారు. ఈ ఘటనపై సోమవారం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.1.01 లక్షల విరాళం


దాత పుల్లారావు దంపతులకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ సూపరింటెండెంట్

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడి కుటుంబం సోమవారం రూ.1,01,116 విరాళంగా అందజేసింది. ఏలూరు మండలం జోగన్నపాలెంకు చెందిన బలుసు పుల్లారావు, స్వర్ణలత దంపతులు ముందుగా కుటుంబ సభ్యులతో కలసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాత దంపతులకు ఆలయ సూపరింటెండెంట్ రమణరాజు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

21న గోపన్నపాలెంలో నియోజకవర్గ స్పోర్ట్స్ సమావేశం

దెందులూరు: గోపన్నపాలెంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈ నెల 21న ఉదయం 8.30 గంటలకు దెందులూరు నియోజకవర్గ స్పోర్ట్స్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహించనున్నట్టు దెందులూరు స్పోర్ట్స్ కాంప్లెక్స్ కార్యదర్శి ఎల్‌వీడీ రవిబాబు తెలిపారు. గోపన్నపాలెం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం డాక్టర్ మరీదు మనోహర్ అధ్యక్షతన స్పోర్ట్స్ కాంప్లెక్స్ సమావేశం నిర్వహిస్తామని, వ్యాయామ ఉపాధ్యాయులు తప్పనిసరిగా స్పోర్ట్స్ యూనిఫామ్‌తో హాజరు కావాలని వివరించారు.

క్లుప్తంగా

మద్ది ఆంజనేయస్వామి సన్నిధిలో...


భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్‌కు ఆశీర్వచనాలు అందజేస్తున్న పండితులు

జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి వారిని సోమవారం భీమవరం ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆలయ మర్యాదలతో ఆయనకు స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం ఎమ్మెల్యే శ్రీనివాస్‌కి పండితులు వేద మంత్రాలతో ఆశీర్వచనాలు అందజేశారు. ఆలయ ఈవో ఆకుల కొండలరావు ఎమ్మెల్యేకి శేషవస్త్రాన్ని కప్పి స్వామి వారి ప్రసాదం, చిత్రపటాన్ని అందజేశారు.

ఇస్రో శాస్త్రవేత్తలకు వందనం


కొయ్యలగూడెం బాలికల హైస్కూల్ స్కౌట్ విద్యార్థుల ప్రదర్శన

కొయ్యలగూడెం: ఇస్రో శాస్త్రవేత్తలకు వందన సమర్పణ కార్యక్రమం పరింపూడి బాలికోన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించారు. జీఎస్‌ఎల్‌వీ-14 ఉపగ్రహం విజయవంతంగా కక్షలోకి ప్రవేశపెట్టి ప్రపంచ దేశాలకు భారతదేశ ఘనత చాటి చెప్పినందుకు కృతజ్ఞతగా శాస్త్రవేత్తలకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్కౌట్ విభాగానికి చెందిన విద్యార్థులు దేశభక్తి గీతాలను ఆలపిస్తూ సాంస్కృతిక ప్రదర్శన నిర్వహించారు. జయహో ఇస్రో, జయ జయహో భారత్ అంటూ నినదించారు.

ఛత్రపతి శివాజీ జయంతి


సీఎస్‌టీఎస్ కళాశాలలో ఛత్రపతి శివాజీ జయంతి నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: స్థానిక ఛత్రపతి శివాజీ త్రిశతజయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం శివాజీ జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ ప్రసాద్‌బాబు శివాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. శివాజీ పట్టుదల, కార్యదీక్షను విద్యార్థులు అలవర్చుకోవాలని అన్నారు. పొలిటికల్ సైన్స్ డిపార్ట్‌మెంట్ అధ్యాపకులు ఎం.శ్రీనివాసరావు, ఇతర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

సంగీత ఆరాధనోత్సవం


సబ్బి కనకారావును సత్కరిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: పట్టణంలో ఆదివారం రాత్రి చిలుకూరి సుబ్బయాచారి ఆధ్వర్యంలో ఘంటసాల సంగీత ఆరాధనోత్సవం ఘనంగా జరిగింది. పలుప్రాంతాల నుంచి వచ్చిన గాయకులు ఘంటసాల పాటలు పాడారు. ఈసందర్భంగా ప్రజా నాట్యమండలి సీనియర్ కళాకారులు బుర్ర కథ బ్రహ్మ సబ్బి కనకారావును ఘనంగా సత్కరించారు. ఈసభలో వైఎస్సార్‌సీపీ వందనపు వెంకటేశ్వరరావు, కర్రా శ్రీధర్, కళాకారులు కాసర నర్సిరెడ్డి, దొంతోజు కృష్ణస్వామి బృందం పాల్గొన్నారు. అలాగే దూబచర్ల నివాసి కళాకారిణి అంజలిని సత్కరించారు. వాసవిక్లబ్ గోల్డ్ చైర్మన్ చిన్ని సాయికుమార్, స్థానిక కళాకారులు అంజలికి ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో తిప్పాభొట్ల రామకృష్ణ పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనారసింహుని కల్యాణం


స్వామివారి కల్యాణోత్సవం సందర్భంగా సుదర్శన హోమం నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: కొయ్యలగూడెంలోని శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత మదన గోపాల స్వామి ఆలయంలోని ఉపాలయంలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. తొలుత స్వామివారి మూలవిరాట్ విగ్రహానికి పంచామృతాలతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. విశ్వక్సేన పూజ, సుదర్శన హోమం జరిపించారు. సాయంత్రం ఆలయ ప్రధాన అర్చకులు గుడిపూడి శేషాచార్యులు, వేద పురోహితులు లింగాల శరత్‌ల ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణోత్సవం నిర్వహించారు. ఆలయ కమిటీ పర్యవేక్షణలో భక్తులకు ప్రసాద వితరణ చేశారు. మంగళవారం భీష్మ ఏకాదశి వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత


మైసన్నగూడెంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేస్తున్న సుబ్బారావు

జంగారెడ్డిగూడెం రూరల్: మైసన్నగూడెంలో ఇరువురికి ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను సోమవారం అందజేశారు. జుత్తుక నాగరాజుకి రూ.6,50,000, ఉండ్రాజవరపు ముత్తమ్మకి రూ.35,000 చెక్కులను వైఎస్సార్‌సీపీ గ్రామ గౌరవ అధ్యక్షులు కుర్రు సుబ్బారావు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని కృషి వల్ల అర్హులకు ప్రభుత్వం ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధి సొమ్ములు అందాయన్నారు. వైఎస్సార్‌సీపీ గ్రామ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పోలవరాన్ని ప్రత్యేక జిల్లా చేయాలి

పోలవరం రూరల్: పోలవరం కేంద్రంగా పోలవరం జిల్లాను ఏర్పాటుచేయాలని అఖిలపక్ష జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో నాయకులు, పలు ప్రజా సంఘాలు, వ్యాపారస్తులు కోరుతున్నారు. మండలంలోని పలు గ్రామాలకు వీరు వెళ్లి జిల్లా ఏర్పాటు ఆవశ్యకతను తెలియజేసి, వారి మద్దతును కోరారు. ఈ నేపథ్యంలో మంగళవారం పోలవరం ఏటిగట్టు సెంటర్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించడం జరుగుతుందన్నారు. అలాగే వంటా వార్పు కార్యక్రమం కూడా చేపడతామన్నారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో ప్రజలు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

మోటార్ మరమ్మతు చేయించాలని వినతి

పోలవరం రూరల్: పోలవరం మండలం ప్రగడపల్లి పంచాయతీ పరిధిలోని గార్లగొయ్యి గ్రామంలో మోటార్ రిపేరు వల్ల తాగునీటి సరఫరా కావడం లేదని, మరమ్మతు చేయించాలని సోమవారం ఎంపీపీ సుంకర వెంకటరెడ్డికి గ్రామస్తులు వినతిపత్రం సమర్పించారు. గత మూడు రోజులుగా మోటార్ రిపేరు వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. వెంటనే ఎంపీపీ వెంకటరెడ్డి ఎంపీడీవో జి.శ్రీను, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ సిబ్బందితో మాట్లాడారు. తక్షణమే మోటార్ మరమ్మతుచేసి తాగునీరు సరఫరా చేయాలన్నారు.

నిర్వాసితుల ధర్నా

కుక్కునూరు: మర్రిపాడు గ్రామంలోని ఆర్‌అండ్ ఆర్ కాలనీలో తమ కోసం నిర్మించిన ఇళ్లను తమకు అప్పగించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో కొత్తూరు నిర్వాసితులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి యర్రంశెట్టి నాగేంద్రరావు మాట్లాడుతూ, కొత్తూరు గ్రామ నిర్వాసితుల కోసం ప్రభుత్వం మర్రిపాడు పునరావాస కాలనీలో ఇళ్లు నిర్మించిందని, ఆ ఇళ్లను నిర్వాసితులకు అప్పగించి వారికి కరెంట్, నీరు, మరుగుదొడ్డి సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరారు.

బాధిత కుటుంబానికి సాయం


బాధిత కుటుంబానికి దుప్పట్లు, చీరలు అందజేస్తున్న సీపీఐ నాయకులు

కుక్కునూరు: విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా సర్వం కోల్పోయి నిరాశ్రయులైన బాధిత కుటుంబానికి సోమవారం తపన ఫౌండేషన్, సీపీఐ నాయకులు సాయం అందించారు. దాచారం పంచాయతీ పాతూరు గ్రామానికి చెందిన ఇరకం ముత్తమ్మకు చెందిన పూరిగుడిసె శనివారం రాత్రి సమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా దగ్ధమైంది. కాగా విషయం తెలుసుకున్న తపన ఫౌండేషన్ చైర్మన్ సీతారామాంజనేయచౌదరి ఫౌండేషన్ తరుపున బిందె, కంచాలు, గ్లాసులు, టిఫిన్ బాక్స్‌లు, బకెట్లు, ఇతర నిత్యావసర గృహోపకరణాలు అందించారు. సీపీఐ నాయకులు దుప్పట్లు, చీరలు, రూ.వెయ్యి సాయాన్ని అందించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వాడపల్లి లక్ష్మణాచార్యులు, ఉపాధ్యక్షులు చెరవుకట్ల సతీష్ సీపీఐ నాయకులు మైసాక్షి వెంకటాచారి, కొన్నె లక్ష్మయ్య, వర్కా శ్యామల, వరసా పాపారావు తదితరులు పాల్గొన్నారు.